సాక్షి ఖమ్మం

గురువారం ౹ 17 ౹ అక్టోబర్ ౹ 2024



పత్తి కొనుగోళ్లకు సిద్ధం

జిల్లాలో ఎంపిక చేసిన తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 8లో



చైన్‌స్నాచర్ల కలకలం

ఒంటరిగా వెళ్తున్న వారే కాక రద్దీ ప్రదేశాల్లో మహిళల మెడలో బంగారు గొలుసుల చోరీ ఘటనలు నానాటికీ పెరుగుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గంటగంటకు ఉష్ణోగ్రత పెరుగుతూ మధ్యాహ్ననికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు డిగ్రీ కళాశాలల స్థాయి క్రికెట్ టోర్నీ



ఖమ్మంస్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఈనెల 17, 18వ తేదీల్లో ఖమ్మం జోన్(ఉమ్మడి జిల్లా స్థాయి) క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకన్న తెలిపారు. ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే పోటీలకు జట్లు ఉదయం 8గంటలకల్లా చేరుకోవాలని సూచించారు. క్రీడాకారులు విధిగా ఎలిజిబులిటీ ఫామ్, కళాశాల గుర్తింపు కార్డు, ఎస్సెస్సీ మెమో జిరాక్స్ తీసుకురావాలని, వివరాలకు 944123 6384 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యానిధి పథకం దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంమయూరిసెంటర్: 2024–25 విద్యాసంవత్సరం విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 29వరకు పొడిగించినట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. యూఎస్‌ఏ, కెనడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చదివే విద్యార్థులు తెలంగాణ ఈ పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత దరఖాస్తు ప్రతులు, ధ్రువపత్రాలను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని డీడీ తెలిపారు.

ఆస్పత్రిలో డీఎంహెచ్‌ఓ తనిఖీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.సుబ్బారావు బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వ్యాక్సినేషన్, ఓపీ రికార్డులను పరిశీలించిన ఆయన మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటిస్తూ సరిపడా మందులను అందించాలని.. మందుల కొరత ఏర్పడకముందే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

ఖమ్మంవన్‌టౌన్: పారిశుద్ధ్య పనులు ప్రణాళికాయుతంగా నిర్వహిస్తూ పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలతో బుధవారం ఖమ్మంలో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ క్రమపద్ధతిలో చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టొచ్చని తెలిపారు. ఇక పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నుల బకాయిలు వసూలు చేయాలని డీపీఓ ఆదేశించారు. ఈసమావేశంలో డీఎల్‌పీఓ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.


నేడు శబరి స్మృతి యాత్ర..

దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం శబరి స్మృతి యాత్ర జరగనుంది. ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం గిరిజన సంప్రదాయ నృత్యాలతో గిరి ప్రదక్షిణ, అనంతరం ఆలయంలో శబరికి ఫల, పుష్పాంజలి, స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఆతర్వాత అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయానికి దేవస్థానం ప్రచార రథం ద్వారా స్వామి వారిని తోడ్కొని వెళ్లి గిరిజనుల చెంతన సీతారాముల కల్యాణం జరపనున్నారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈఓ రమాదేవి ఓ ప్రకటనలో కోరారు.

సన్నాల రైతులకు వెన్నుదన్నుగా..



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు (ఫైల్)



సన్నరకం ధాన్యం దిగుబడి అంచనా
6,21,094 మెట్రిక్ టన్నులు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేది
3,89,053 మెట్రిక్ టన్నులు

ధాన్యం సేకరణకు పౌరసరఫరాల సంస్థ ప్రణాళిక

- ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో ఎక్కువగా సాగైన ఈ రకం
- జిల్లాలోని 322 కొనుగోలు కేంద్రాల్లో 267 కేటాయింపు
- జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం సరఫరా
- జిల్లాలో ఇప్పటికే మొదలైన 31 కేంద్రాలు

కొనుగోలు కేంద్రాల వివరాలు

ఏజెన్సీ	సన్నరకం కేంద్రాలు	దొడ్డు రకం	మొత్తం
పీఏసీఎస్	155	-	155
డీఆర్‌డీఏ	82	55	137
డీసీఎంఎస్	30	-	30
మొత్తం	267	55	322

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈ ఖరీఫ్‌లో సాగైన సన్న రకం ధాన్యం సేకరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో సన్న రకం ధాన్యం ఎక్కువగా సాగైందన్న అంచనాతో అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మొత్తం 322 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా.. అందులో 267 కేంద్రాలను సన్నధాన్యం కొనుగోలుకు కేటాయించారు. వీటి ద్వారా 3,89,053 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

అంచనాలకు అనుగుణంగా..

ఈ ఏడాది వరి అంచనాలకు అనుగుణంగా సాగైంది. తొలుత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా.. ఆ తర్వాత వర్షాలు సమృద్ధిగా కురవడంతో జలాశయాల్లోకి నీరు చేరింది. అలాగే నాగార్జునసాగర్ నుంచి కూడా నీరు విడుదల కావడంతో 2,81,991 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. తద్వారా 6,77,450 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని పౌర సరఫరాల సంస్థ అంచనా వేసింది. ఇందులో 4,29,630 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని ప్రణాళిక సిద్ధం చేసింది.

దొడ్డు ధాన్యం 55 కేంద్రాల్లోనే

ఈ సీజన్‌లో 56,356 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 6,21,094 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 40,577 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 3,89,053 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని 322 కేంద్రాల ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేవలం సన్న రకం ధాన్యం సేకరణకే 267 కేంద్రాలు కేటాయించగా.. మిగతా 55 కేంద్రాల్లో దొడ్డు ధాన్యం కొనుగోలు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి సన్నరకాలకే రూ.500 బోనస్ ఇస్తామని చెబుతుండడంతో జిల్లాలో ఈ రకం సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో చింతకాని మండలానికి అతి తక్కువగా నాలుగు కేంద్రాలు సన్నరకం ధాన్యం సేకరణకు కేటాయించారు. ఇక ఎక్కువగా పెనుబల్లి మండలంలో 27, కల్లూరు మండలంలో 25, వేంసూరు మండలంలో 24, నేలకొండపల్లి మండలంలో 22 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

సన్న రకానికే జై

ఈ ఏడాది ఖరీఫ్‌లో సన్న రకం ధాన్యం సాగుకే రైతులు మొగ్గు చూపారు. మొత్తం 2,81,991 ఎకరాల్లో వరి సాగైతే ఇందులో సన్న రకం 2,62,230 ఎకరాల్లో, దొడ్డు రకాలు 19,761 ఎకరాల్లో సాగయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది వరి ధాన్యం క్వింటాకు రూ.2,300గా కనీస మద్దతు ధర ప్రకటించింది. గ్రేడ్–ఏ(సన్న రకం) ధాన్యానికి రూ.2,320గా నిర్ణయించారు. గత ఏడాది 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర ఉండగా ఈ ఏడాది క్వింటాకు రూ.117 పెరిగింది. అలాగే ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో రైతులకు రూ.2,820 చొప్పున ధర దక్కనుంది.

కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో సాగుచేసిన ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇప్పటికే 31 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యాన 20 మండలాల్లో ఒక్కొక్కటి, పీఏసీఎస్‌ల ద్వారా నాలుగు, డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏడు కేంద్రాలు మొదలయ్యాయి. ఆపై వరి కోతలకు అనుగుణంగా మిగతా కేంద్రాలను ప్రారంభిస్తారు.

అన్నింటికీ సన్న రకాలే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సన్న రకం ధాన్యం సాగుపై రైతులకు దిశానిర్దేశం చేస్తోంది. దీంతో రైతులు అటే మొగ్గు చూపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేశాక మిల్లులకు కేటాయించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)గా సేకరిస్తారు. ఆపై ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వినియోగించనున్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇవ్వనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఇదేకాక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ వసతి గృహాలకు సైతం సన్న బియ్యం కేటాయించనుడడంతో సాగుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

పేదల సంక్షేమం మాతోనే సాధ్యం



మహిళకు చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

- ఈనెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల పథకం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతుండగా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ పేదల సంక్షేమానికి పాటుపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కొన్ని హామీలు ఇవ్వకున్నా ప్రజా సంక్షేమం దృష్ట్యా అమలు చేస్తున్నామని తెలిపారు. నేలకొండపల్లిలోని రామదాసు ఆడిటోరియంలో బుధవారం జరిగిన సమావేశంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు గీతకార్మికులకు కాటమయ్య రక్ష కిట్లను మంత్రి పంపిణీ చేశారు. అలాగే, పీఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు 620 మందికి సైకిళ్లు అందజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ నెలా ఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదలవుతుందని తెలిపారు. నియోజకవర్గానికి 4వేల చొప్పున ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం తీరుతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని.. ఫలితంగా మహిళలకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో ఆలస్యమైందని తెలిపారు. అయితే, ఆ పథకం కూడా త్వరలో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు రూ.18 వేల కోట్ల మేర మాఫీ చేశామని, మిగతా రూ.13 వేల కోట్ల రుణాలను సైతం మాఫీ చేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ గణేష్, డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ సీతారాములు, నాయకులు రమ్య, రాయపూడి నవీన్, వి.నాగేశ్వరరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, బొందయ్య, యడవల్లి తిరపయ్య, బోయిన వేణు, మైశా శంకర్, గుండా బ్రహ్మం, కొమ్మినేని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే...

కూసుమంచి: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుండగా.. పేదలకే లబ్ధి జరిగేలా ఇందిరమ్మ కమిటీల సభ్యులు, నాయకులు చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఖమ్మంరూరల్ మండల అధికారులు, నాయకులతో జరిగిన సమీక్షలో గ్రామాల వారీగా సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని సూచించిన మంత్రి, ప్రతీ వారం మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ పర్యటించి తాగునీరు, డ్రెయినేజీలు, రహదారుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. పల్లెగూడెం నుండి ఎంపీ.పాలెం వరకు సెంట్రల్ లైటింగ్, ముత్తగూడెం విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటుపై సానుకూలంగా స్పందించారు. ఆర్డీఓ గణేష్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ సురేష్, ఎంఈఓ శ్రీనివాసరావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, నాయకులు కల్లెం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, బోడ వెంకన్న, కన్నెటి నర్సింహారావు, భూక్యా సురేష్ పాల్గొన్నారు.

ఖమ్మం లైబ్రరీలో సిద్ధమైన 13 మందికి ఉద్యోగాలు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సిద్ధమైన నిరుద్యోగుల్లో 13 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయి. డీఎస్సీ–2024లో 11 మంది ఉద్యోగాలను సాధించగా, ఇందులో తొమ్మిది మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్‌జీటీలు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు మమత, రాము, కోటి, నర్సింహారావు, సుధీర్, వెంకటేష్, సాంబయ్య, రాంబాబు, రాజు, ఎస్‌జీటీ ఉద్యోగాలకు గోపి, ఉపశ్రీ ఎంపికయ్యారు. అలాగే, గిరిధర్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా, సుధీర్ మరో ప్రభుత్వ శాఖలో ఉద్యోగం సాధించారు. ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నిరుద్యోగులు ఖమ్మం గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఏటా ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది 13మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని లైబ్రరీ కార్యదర్శి అర్జున్ తెలిపారు. ఈమేరకు అభ్యర్థులను కార్యదర్శితో పాటు గ్రంథాలయ ఉద్యోగులు అభినందించారు.

కొత్త టీచర్లతో కొరత తీరినట్లే..

- విధుల్లో చేరిన 481మంది నూతన ఉపాధ్యాయులు
- ఉదయం మండలాల వారీగా ఎమ్మార్సీల్లో రిపోర్ట్
- మధ్యాహ్నం తర్వాత బోధన ప్రారంభం



ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు కవిత

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఏళ్లుగా బడుల్లో టీచర్ల కొరత ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ పోస్టుల భర్తీకి నిర్ణయించింది. ఈమేరకు డీఎస్సీ నిర్వహించి తక్కువ సమయంలోనే ఫలితాలు వెల్లడించి పోస్టింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా మంగళవారం పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేయగా ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఫలితంగా బోధనకు ఢోకా ఉండదని విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

481మంది విధులకు...

డీఎస్సీ ద్వారా ఎంపికైన 516మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వగా... వీరిలో 481మంది బుధవారం విధుల్లో చేరారు. ఇంకా 35మంది చేరాల్సి ఉంది. అయితే, పోస్టింగ్ ఆర్డర్ తీసుకున్నాక 15రోజుల సమయం ఉంటుందని.. కొందరు ఇతర ఉద్యోగాల్లో కొనసాగుతుండడంతో రిలీవ్ కావడానికి సమయం పడుతోందని తెలిసింది. కాగా, పోస్టింగ్ ఉత్తర్వులతో బుధవారం ఉదయం మండలాల వారీగా ఉపాధ్యాయులు ఎమ్మార్సీ(మండల రిసోర్స్ సెంటర్)లకు చేరుకున్నారు. అక్కడ రిపోర్ట్ చేశాక కేటాయించిన పాఠశాలలకు వెళ్లి హెచ్‌ఎంలకు ఆర్డర్ కాపీలు అందించారు. ఆపై నూతన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల హడావుడితో రోజంతా పాఠశాలలు సందడిగా కనిపించాయి. ఆపై మధ్యాహ్నం నుంచి కొత్త టీచర్లు బోధన ప్రారంభించడంతో విద్యార్థుల్లోనూ ఉత్సాహం నెలకొంది.

కేటాయింపు ఇలా...

ఖమ్మం అర్బన్ మండలంలో 62 పాఠశాలలకు గాను 100 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. తాజా డీఎస్సీ ద్వారా 44 పోస్టుల భర్తీకి నిర్ణయించి మంగళవారం జరిగిన కౌన్సెలింగ్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఖమ్మం అర్బన్ ఎమ్మార్సీ)లో ఎంఈఓ రాములుకు రిపోర్ట్ చేశారు. ఆతర్వాత కేటాయించిన పాఠశాలల్లో ఆర్డర్ కాపీని అందించి విధుల్లో చేరారు. కాగా, విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించామని ఎంఈఓ తెలిపారు. కాగా, 1998 తర్వాత భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం, 20ఏళ్ల తర్వాత మైదానం, ఏజెన్సీ ప్రాంతమనే తేడా లేకుండా ఉపాధ్యాయులను నియమించడంతో కొరత తీరి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు తాము ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేలా బోధన



సింగారెడ్డిపాలెంలో కొత్త ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

నేలకొండపల్లి: కొత్త ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరిస్తూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని.. తద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సూచించారు. నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలకు బుధవారం వచ్చిన ఆయన విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అనూష, స్వాతిని అభినందించి మాట్లాడారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం హరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలపై అద్దె భారం

- ఎక్కువగా కిరాయి భవనాల్లోనే సంక్షేమ గురుకులాలు
- ప్రస్తుతం రూ.3.41 కోట్ల మేర బకాయిలు
- రెండు నెలల అద్దె విడుదలైందంటున్న అధికారులు



వైరా మండలం రెబ్బవరంలో జ్యోతిబాపూలే గురుకులం కొనసాగుతున్న అద్దె భవనం

ఖమ్మంమయూరిసెంటర్: పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ గురుకులాలు ఎక్కువగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనాలు అందుబాటులో లేక ప్రాంతాల వారీగా నెలకు రూ.1.50 లక్షల నుండి రూ.2 లక్షకు పైగా అద్దెతో తీసుకున్నారు. అయితే, ప్రభుత్వం నుండి సకాలంలో అద్దె రాకపోవడంతో పలుచోట్ల భవనాలకు యజమానులు మంగళవారం తాళం వేశారు. దీంతో అధికారులు మాట్లాడి తాళాలు తీయించారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోవడంతో డిగ్రీ కళాశాలలను బంద్ చేయగా.. గురుకులాలకు తాళాలు వేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. అయితే, రాష్ట్రంలోని చాలా చోట్ల గురుకులాల భవనాలకు యజమానులు తాళాలు వేయడంతో స్పందించిన ప్రభుత్వం రెండు నెలల అద్దె విడుదల చేసిందని అధికారులు చెబుతున్నారు. కానీ యజమానులు మాత్రం తమ ఖాతాల్లో జమ అయినట్లుగా ఎక్కడా వెల్లడించకపోవడం గమనార్హం.

బకాయిలు రూ.3.41 కోట్లకు పైగానే..

జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో భవనం అద్దె నెలకు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉండగా గతంలో రెండు, మూడు నెలలకోసారి యజమానులకు చెల్లించేవారు. అయితే, ఇప్పుడు ఏడు నుంచి 9నెలల వరకు అద్దె బకాయి ఉందని యజమానులు పేర్కొంటున్నారు. ఇలా మూడు శాఖల్లో కలిపి రూ.3.41 కోట్ల మేర బకాయి ఉందని అంచనా.

- జిల్లాలో నాలుగు ఎస్సీ గురుకులాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. వీటికి నెలకు రూ.2 లక్షల మేర అద్దె చెల్లించాల్సి ఉండగా.. ఏడు నెలలుగా కిరాయి పెండింగ్‌లో ఉంది. ఇలా రూ.56 లక్షలకు పైగా శాఖ నుండి యజమానులకు అందాల్సి ఉందని సమాచారం.
- బీసీ గురుకులాలు మొత్తం 16కు గాను రెండు మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. మిగతా 14 గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి నెలనెలా రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. ఈ భవనాలకు ఏడునెలలుగా అద్దె రాకపోవడంతో రూ.1.89 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.
- జిల్లాలో ఎనిమిది మైనారిటీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి నెలకు రూ.2 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఈ శాఖ నుంచి ఆరు నెలలుగా అద్దె బకాయిలు విడుదల కాకపోవడంతో రూ.96 లక్షలు బకాయి ఉంది.

స్పందించకపోతే ఆస్తుల వేలం

- ఎస్‌ఏఆర్ మిల్లుపై చర్యలకు కదిలిన ప్రభుత్వం
- రూ.81.60 కోట్ల సీఎంఆర్ బకాయిపడిన యాజమాన్యం
- సంబంధిత అధికారుల మెడకు బిగుస్తున్న ఉచ్చు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్)ను పక్కదారి పట్టించిన కొణిజర్ల మండలం లాలాపురంలోని ఎస్‌ఏఆర్ మిల్లుపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. మిల్లుకు సంబంధించి ఎం.రామజ్యోతి భర్త బాలకృష్ణ ప్రసాద్ 2022 – 23 రబీ, 2023 – 24లో రూ.81,60,90,635 విలువైన సీఎంఆర్ బకాయి ఉన్నట్లు అధికారులు తేల్చారు. బకాయిలను చెల్లించాలని నోటీసులు ఇచ్చినా గడువులోగా స్పందన రాకపోవడంతో రెండో నోటీస్ ఇచ్చారు. ఈ నోటీసుకు కూడా స్పందించకపోతే రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం ఆస్తులు వేలం వేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

భారీగా తేడాతో..

జిల్లాలోని పలు మిల్లుల తీరుపై ప్రభుత్వానికి గత నెలలో ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్‌ను పక్కదారి పట్టించి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారని, మిల్లర్లకు సంబంధిత శాఖ అధికారుల సహకారం కూడా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఎస్‌ఏఆర్ మిల్లులో తనిఖీ చేయగా రూ.81.60 కోట్ల విలువైన సీఎంఆర్‌ను పక్కదారి పట్టించినట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. అంతేకాక మరో నాలుగు మిల్లులు కూడా ఇలాగే వ్యవహరించాయని గుర్తించినా, ఎస్‌ఏఆర్ మిల్లులోనే భారీగా తేడా ఉండడంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

అధికారుల్లో దడ

సీఎంఆర్ పక్కదారి పట్టిన వ్యవహారంలో సంబంధిత అధికారులపై ఇప్పటికే విచారణ పూర్తయింది. అదనపు కలెక్టర్ శ్రీజ విచారణ చేపట్టగా ఎన్ని మిల్లుల నుంచి సీఎంఆర్‌ను బహిరంగ మార్కెట్‌కు తరలించారు, ఇందులో అధికారుల పాత్ర ఏమిటన్నది ఆమె ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ప్రభుత్వం ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉండడంతో ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని అధికారిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

రేపు ఖమ్మంలో జాబ్ మేళా

ఖమ్మంరాపర్తినగర్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి మాధవి తెలిపారు. రిలయన్స్ ట్రెండ్స్, భారత్ హ్యుండాయ్ సంస్థల బాధ్యులు హాజరై ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన జిల్లాలోని నిరుద్యోగ యువత అర్హులని, వివరాలకు 70369 02902, 93929 22065 నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

మిరపలో కాండం కుళ్లు తెగులు


కాండం కుళ్లు సోకిన మిరప మొక్క

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరపతోటల్లో కాండం కుళ్లు తెగులు సోకిందని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు రైతుల మిరప చేన్లను పరిశీలించిన ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మిరప పంట పూత, కాత దశలో ఉన్నందున భూమిలో తేమ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో కాండం కుళ్లు తెగులు సోకి మొక్కలు వడలి పోతున్నాయని తెలిపారు. ఈ మేరకు రైతులు బ్లూ కాపర్ (కాపర్ ఆక్సీ క్లోరైడ్) మూడు గ్రాములను లీటర్ నీటిలో కలిపి చనిపోతున్న మొక్క మొదలుతో పాటు చుట్టుపక్కల మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, తయోఫినైట్ మిథైల్ (రోకో) కూడా పిచికారీ చేయాలని, నీటి తడులు తగ్గించాలని ఏఓ సూచించారు.

యూట్యూబ్ చానల్‌కు చెందిన ముగ్గురి అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిపై కల్పిత వార్త రూపొందించడమే కాక ప్రసారం చేయకుండా ఆపాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించిన యూట్యూబ్ చానల్‌కు చెందిన ముగ్గురిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. యూట్యూబ్ చానల్ సీఈఓ పుచ్చకాయల ప్రకాష్, బ్యూరో చీఫ్ అత్తలూరి రామకృష్ణ అలియాస్ రాంకీ, అసిస్టెంట్ కెమెరామెన్ షేక్‌బాబా ఇటీవల నిజాంపేట ప్రాంతంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి వెళ్లి ఏటా తమకు రూ.5 లక్షల యాడ్ ఇవ్వాలని బెదిరించారు. లేనిపక్షంలో ఆస్పత్రిపై రూపొందించిన కథనాన్ని చానల్‌లో అప్‌లోడ్ చేస్తామనడంతో యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. దీంతో ముగ్గురిపై దోపిడీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రహదారిపై గుంతలో పడటంతో ఘటన

కొణిజర్ల: జాతీయ రహదారిపై గుంతల్లో వాహనం దిగబడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ జి.సూరజ్ కథనం ప్రకారం.. తనికెళ్లకు చెందిన సుతారీ చల్లా శివ కుమార్ వైరాలో పనికి బుధవారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్ దాటాక ఎస్ఎస్‌పీ కాల్వ సమీపాన రోడ్డుపై గుంతలు ఉండటంతో అందులో బైక్ దిగపడగా శివ వాహనంపై నుంచి ఎగిరి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయాలు కాగా వాహనదారులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ చేరుకుని 108లో ఖమ్మం తరలించారు. అయితే, శివ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఆయిల్‌పామ్ గెలల సేకరణ నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో వార్షిక నిర్వహణ నేపథ్యంలో గురువారం నుంచి ఆయిల్‌పామ్ గెలల సేకరణ నిలిపివేస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం గెలలు తక్కువగా వస్తున్న కారణంగా సేకరణ నిలిపి వేశామని, గురువారం నుంచి రైతులు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి తరలించాలని సూచించారు. కాగా, ఈ ఏడాది జనవరిలోనే ఫ్యాక్టరీ నిర్వహణ పేరుతో గెలల సేకరణ నిలిపివేయగా, మళ్లీ ఇప్పుడు నిలిపివేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. టన్ను, అరటన్ను దిగుబడి వచ్చే సమయంలో అప్పారావుపేట ఫ్యాక్టరీకి వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందని చెబుతున్నారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ వద్ద అధికారులే గెలలు సేకరించి అప్పారావుపేట ఫ్యాక్టరీకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	4,000
మిర్చి	16,900	6,000
మిర్చి తాలు	9,400	5,400
ఏసీ మిర్చి	19,100	10,000
ఏసీ తాలు	9,700	6,000
కొత్త పత్తి	7,000	5,600
పాత పత్తి	7,200	7,150

– ఖమ్మం వ్యవసాయం

చైన్‌స్నాచర్ల కలకలం

ఖమ్మం పాత బస్టాండ్ రద్దీగా ఉండటాన్ని అదునుగా తీసుకున్న ఓ వ్యక్తి గత సోమవారం బస్సు ఎక్కేందుకు వచ్చిన మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు చోరీ చేశాడు. నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన బాధితురాలు కోటమ్మ కాసేపయ్యాక గుర్తించగా ఆగంతకుడి జాడ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనే కాకుండా జిల్లాలో ఇటీవల గొలుసు చోరీలు సర్వసాధారణం కావడంతో బాధితులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు.



జిల్లాలో పలుచోట్ల గొలుసు దొంగతనాలు

- పండుగ రద్దీతో పేట్రేగిపోతున్న దుండగులు
- పోలీసుల పట్టింపు లేక పెరుగుతున్న చోరీలు
- సీసీ కెమెరాలు పనిచేయక కష్టంగా మారుతున్న దర్యాప్తు

ఖమ్మంక్రైం: జిల్లా వ్యాప్తంగా చైన్ స్నాచర్లు పేట్రేగిపోతున్నారు. సాయంత్రం వేళ ఒంటరిగా వెళ్తున్న మహిళలే కాక రద్దీగా ఉండే బస్టాండ్లు తదితర ప్రాంతాలనే లక్ష్యంగా ఎంచుకుని చోరీలు చేస్తున్నారు. బైక్‌పై ఒకరో, ఇద్దరో రావడం మహిళల మెడ నుంచి అవలీలగా గొలుసు లాక్కెళ్లి పారిపోతున్న ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. మహిళలు తేరుకుని అరిచేలోగా నిందితులు ఆ ప్రాంతం నుంచి మాయమైపోతున్నారు. కొంతకాలంగా ఇలాంటి ఘటనలు తగ్గుముఖం పట్టాయని భావిస్తుండగా మళ్లీ చోరీలు మొదలుకావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

బైక్‌లపైనే ఎక్కువ..

ఒంటరిగా నడిచి వెళ్తున్న వారే కాకుండా ఇద్దరు మహిళలు వెళ్తున్నా వారిని నిందితులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. నంబర్ ప్లేట్ లేని హై స్పీడ్ బైక్‌లపై వస్తున్న వారు ఒకవేళ సీసీ కెమెరాల్లో నమోదైనా బయటపడకుండా ముఖానికి కర్చీఫ్ లేదా హెల్మెట్ ధరించి ఉంటున్నారు. ఈ క్రమంలో మహిళల మెడలో బంగారు గొలుసు లాక్కుని కళ్లు మూసి తెరిచే లోగా వెళ్లిపోతున్నారు. బాధితులు తేరుకోని లబోదిబోమంటూ అరుస్తుండగానే కంటికి కూడా కనిపించడం లేదు. అయితే, ఇలాంటి ఘటనలు గతంలో జిల్లా కేంద్రం, పట్టణాల్లో జరగగా.. ఇప్పుడు గ్రామాల్లోనూ తరచుగా జరుగుతున్నాయి. కిరాణా దుకాణాల్లో ఒంటరిగా మహిళలను గుర్తించి ఏదో సరుకు కొనుగోలు చేసే నెపంతో వచ్చి గొలుసులు లాక్కెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు ఉదయం, సాయంత్రం లేదా పట్టపగలే జరుగుతుండటం గమనార్హం.

ఇతర ప్రాంతాల వారేనా?

జిల్లావ్యాప్తంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వారు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. నగరాలు, పట్టణాలకు బతుకుదెరువు కోసం వచ్చిన వారు దురలవాట్లకు బానిసలై డబ్బు కోసం చోరీలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇంకొందరు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా వచ్చి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, నిందితుల్లో ఎక్కువగా 18 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు గల వారు ఉండటం .. బైక్‌లపైనే వస్తున్నారని పోలీసుల విచారణలో బయటపడుతోంది.

40 గొలుసులు.. రూ.70 లక్షల సొత్తు

జిల్లావ్యాప్తంగా ఎక్కడో ఓ చోట ప్రతిరోజూ చైన్ స్నాచింగ్ జరుగుతున్నా పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేయకపోవడం నిందితులకు కలిసొస్తోందని సమాచారం. పెట్రోలింగ్ కొరవడటంతో పాటు పాతనేరస్తుల కదలికలను పట్టించుకోకపోవటంతో చైన్ స్నాచింగ్‌లు వరుసగా జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 40కి పైగా చైన్‌స్నాచింగ్‌లు జరగగా బాధిత మహిళలు రూ.70 లక్షలకు పైగా సొత్తు కోల్పోయారు. వరుస పండుగలతో రాకపోకలు పెరగడం.. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు రద్దీగా ఉంటున్న నేపథ్యాన పోలీసులు ఇప్పటికైనా స్పందించి గొలుసు దొంగతనాలను అరికట్టేలా నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


ఈనెల 5న గొలుసు చోరీకి పాల్పడినట్లు భావిస్తూ పోలీసులు విడుదల చేసిన వ్యక్తి చిత్రం (సీసీ కెమెరా పుటేజీ)

నిద్ర పోతున్న నిఘా

ఖమ్మం నగరం తోపాటు ఇతర పట్టణాల్లో చాలాచోట్ల కొద్ది నెలలుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పోలీస్ శాఖ ఆధ్వర్యాన ఐదేళ్ల కిందట అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా నిర్వహణ లోపంతో చాలా వరకు పనిచేయడం లేదని తెలుస్తోంది. దీంతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే ఆగంతకులను గుర్తించడం ఇబ్బందిగా మారిందని పోలీసులే చెబుతున్నారు. కొన్ని రోజుల కిందట ఖమ్మంలో ఒకేసారి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ జరగగా.. ఆగంతకుల గుర్తింపు కోసం ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తే పనిచేయడం లేదని తెలిసింది. దీంతో అక్కడి ఇళ్లలో యజమానులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించినా ఇప్పటివరకు అరెస్ట్ చేయలేకపోయారు. నానాటికీ చోరీలు పెరుగుతున్నా పోలీస్ శాఖ స్పందించి సీసీ కెమెరాల నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పత్తి కొనుగోళ్లకు సిద్ధం

- జిల్లాలో తొమ్మిది జిన్నింగ్ మిల్లుల ఎంపిక
- ప్రచారం లేక తొలిరోజు మొదలుకాని కొనుగోళ్లు



ఖమ్మంవ్యవసాయం: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లకు జిల్లాలో ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాట్లు చేశారు. ఖమ్మం, మద్దులపల్లి, వైరా, నేలకొండపల్లి, మధిర వ్యవసాయ మార్కెట్ల పరిధిలో పది జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేశారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి తేమ శాతం ఆధారంగా రూ.7,521 కనీస మద్దతు ధర నిర్ణయించింది. అయితే ప్రైవేట్ మార్కెట్‌లో ప్రస్తుతం పత్తికి గరిష్టంగా రూ.7వేల ధర పలుకుతుండగా, మిగతా చోట్ల వ్యాపారులు రూ.6,500కు మించి చెల్లించడం లేదు. తేమశాతం కొంత ఎక్కువగా ఉన్న పత్తికి రూ.5వేలే చెల్లిస్తున్నారు. ఇలా ప్రభుత్వ మద్దతు ధరతో పోలిస్తే రైతులు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు నష్టపోతుండడంతో ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు నిర్ణయించింది.

ప్రచారం ఏదీ?

జిల్లాలో గత ఇరవై రోజులుగా పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. అయితే, కొత్త పత్తి కావడంతో తేమ ఉంటుందనే కారణంతో ప్రభుత్వం జాప్యం చేసింది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా ప్రభుత్వ శాఖలు అవగాహన కల్పించలేదు. దీంతో రైతులకు సమాచారం అందలేదు. బుధవారం నుంచే మిల్లుల్లో పత్తి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించినా తొలిరోజు ఏ ఒక్క రైతూ రాలేదు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం మాట్లాడుతూ రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఇతర ధృవీకరణ పత్రాలతో లూజ్ పత్తిని తీసుకొస్తే నిబంధనల మేరకు సీసీఐ కొనుగోలు చేస్తుందని తెలిపారు.

ఎక్కడెక్కడ అంటే..

పత్తి కొనుగోలుకు జిల్లాలో ఎంపిక చేసిన మిల్లుల వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జీఆర్‌ఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, తల్లంపాడులోని శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్, పొన్నెకల్లులోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్, మధిర మండలం మాటూరులోని మంజీరా కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, దెందుకూరులోని అమరావతి టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇల్లెందులపాడులోని శ్రీ శివగణేష్ కాటన్ ఇండస్ట్రీస్, నేలకొండపల్లి మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్, తల్లాడలోని స్టాపిల్ రిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్‌తో పాటు తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాలోని శ్రీభాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో పత్తి కొనుగోలు చేయనున్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మధు

తిరుమలాయపాలెం: బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడితే భయపడేది లేదని.. నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచి పోరాడుతామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ వెల్లడించారు. మండలంలోని జల్లెపల్లికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్నపై ఇటీవల కేసులు నమోదు కావడంతో బుధవారం ఎమ్మెల్సీ, తదితరులు గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పరిపాలనలో ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రజా వ్యతిరేకత పెరిగిందన్నారు. ఇది తట్టుకోలేక తమ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బీసీ నాయకుడైన వీరన్నపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం గర్హణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు తిరుమల్‌రావు, రమణ, సుబ్బారావు, శంకర్‌రావు, నరేందర్, చావా వేణు, చామకూరి రాజు, తమిర వెంకటరెడ్డి, బోడ మంచా నాయక్, పాల వెంకన్న, పోలెపొంగు వెంకటేశ్వర్లు, తాత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


జల్లెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాత మధు

ముగిసిన కోటమైసమ్మ జాతర



కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువైన శ్రీ కోట మైసమ్మ తల్లి జాతర ముగిసింది. దసరా రోజున మొదలైన జాతర ఐదో రోజైన బుధవారం ముగియగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదు. ఇక జాతర ప్రాంగణంలో జాయింట్ వీల్స్, సర్కస్ తదితర ఏర్పాట్లు ఉండటంతో భక్తజనం పిల్లాపాపలతో సందడిగా గడిపి తిరుగుముఖం పట్టారు. జాతర సందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు.

ఏదీ ఆనాటి కళ..?



పార్క్ ప్రారంభించిన కొత్తలో... (ఇన్‌సెట్) ప్రస్తుతం కళ కోల్పోయిన చిహ్నం



రఘునాథపాలెం మండలం జింకలతండా క్రాస్ వద్ద గతంలో సుడా ఆధ్వర్యాన పార్క్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సుడా ఆధ్వర్యాన నిర్వహణ ఉండటంతో పచ్చటి మొక్కలు, ఆడుకునే వస్తువులతో సందర్శకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం సుడా పాలకవర్గం లేకపోవడం, గ్రామ పంచాయతీలో సిబ్బంది కొరతతో ఆలనాపాలన చూసే వారు కరువయ్యారు. ఫలితంగా పార్క్ ఆవరణలో పిచ్చి మొక్కలు పెరగడమే కాక.. బొమ్మలు కళావిహీనంగా మారాయి. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్

బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో విద్యావ్యవస్థ గందరగోళ పరిస్థితిలో ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించి ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పలువురు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు ఎన్.ఆజాద్, తాళ్ల నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, గుండాల కృష్ణ మాట్లాడారు. విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6 వేల కోట్ల మేర పేరుకుపోయాయని తెలిపారు. మూడు రోజులుగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్ పాటిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇకనైనా విద్యాశాఖకు మంత్రిని కేటాయించి, విద్యా వ్యవస్థపై సీఎం దృష్టి సారించాలన్నారు. కాగా, బకాయిలు విడుదల చేయని పక్షంలో ఈ నెల 18న చలో కలెక్టరేట్ నిర్వహించడంతో పాటు దశలవారీగా జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. కళాశాలల యాజమాన్యాల సంఘం నాయకులు కోటా అప్పిరెడ్డి, మోహన్‌రెడ్డి, కిరణ్‌శౌరి, నవీన్, బొమ్మ సత్యప్రసాద్, కిరణ్, వివిధ సంఘాల నాయకులు ఆవుల అశోక్, టి.లక్ష్మణ్, ప్రవీణ్, సుధాకర్, రాజు, సాయి, మన్సూర్, చంద్రశేఖర్, పృథ్వీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైర్ పర్సన్ నిష్టాశర్మ తెలిపారు. హైస్కూల్ తరగతులకు ఫిజిక్స్ బోధన కోసం సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బీఈడీ కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు ఈ నెల 19లోగా దరఖాస్తులను kpmhskmm@ gmail.com కు పంపించాలని, వివరాలకు 94405 25093 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో వరుస చోరీలు

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్నాళ్లుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. గత నెలలో దుండగులు ఫర్నిచర్ ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం మంగళవారం రాత్రి పాఠశాల తాళాలు పగలగొట్టి ట్యూబ్ లైట్లు చోరీ చేశారు. అలాగే, ఫ్యాన్లను తీసుకెళ్లే ప్రయత్నం చేసినా సాధ్యం కాక వదిలేశారు. ఇక రాత్రయితే చాలు మందుబాబులు పాఠశాలను అడ్డాగా మార్చుకుంటున్నారని తెలుస్తోంది. ఉదయం కల్లా మద్యం సీసాలు పడేసి ఉండటంతో ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జరిగిన చోరీపై హెచ్‌ఎం గోపగాని రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ముదిగొండ: మండలంలోని గంధసిరి మున్నేరు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సువర్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చేపట్టిన తనిఖీల్లో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెంనకు చెందిన ఎస్‌కే యాకూబ్‌పాషా కానరాకుండా పోవడంతో ఆయన తండ్రి సైదులు ఫిర్యాదుమేరకు ఖమ్మంఅర్బన్ పోలీసులు బుధవారం కేసునమోదుచేశారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వద్ద వాటర్ సర్వీసింగ్ సెంటర్ నడిపించే యాకూబ్‌పాషా రోజులాగే మంగళవారం షాపునకు వెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడ ఆరా తీసినా ఫలితం లేక ఆయన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని తురకలగూడెం గ్రామానికి చెందిన పి.పవన్ (27) బుధవారం తెల్లవారుజామున పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, పవన్ ఐదేళ్ల కిందట కిష్టారానికి చెందిన గోపికృష్ణను ప్రేమవివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించగా, కొద్దిరోజులుగా భార్య గోపికృష్ణ పుట్టింట్లో ఉంటోంది. దీంతోనే ఆయన మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాదచారులపైకి దూసుకెళ్లిన కారు

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచలో బుధవారం రాత్రి ఓ కారు పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. కారుడ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. క్షతగాత్రుల్లో ఆరుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. వీరిని కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గాయపడిన వారిలో మంచాల చిన్న నర్సయ్య, మంచాల నర్సమ్మ పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.


ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కన్నకొడుకును హత్య చేసిన తండ్రి

మద్యం మత్తులో వేధిస్తుండటంతో ఆగ్రహం


గణేశ్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: నిత్యం మద్యం సేవించి వస్తూ వృద్ధులైన తల్లిదండ్రులనే కాక సోదరుడిని వేధిస్తుండటంతో భరించలేక ఆ కొడుకును తండ్రి హత్య చేశాడు. ఖమ్మం రామన్నపేట కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సీఐ భానుప్రకాష్ కథనం మేరకు.. కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న కొంపెల్లి గణేశ్ (30)కు ఐదేళ్ల కిందట వివాహమైంది. ఆ తర్వాత దంపతులు విడాకులు తీసుకున్నారు. కొన్నాళ్లుగా గణేశ్ తాగుడికి బానిసై తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాడు. వీరితో పాటు సోదరుడు ఎంత చెప్పినా వినకపోగా మంగళవారం రాత్రి కూడా మద్యం మత్తులో వచ్చిన గణేశ్ తన తండ్రి వెంకటేశ్వర్లుతో ఘర్షణ పడి దాడి చేశాడు. దీంతో ఆగ్రహించిన వెంకటేశ్వర్లు అందరూ నిద్రించాక గణేశ్ తలపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి సోదరుడు నాగేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయగా, నగర ఏసీపీ రమణమూర్తి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.